# పద్మవ్యూహం

రాత్రి ఎనిమిదిన్నర అవుతుంటే పరుగులాంటి నడకతోయింట్లో అడుగుపెడుతూ చెప్పులైనా సరిగా వదలకుండా వంటింట్లోకి పరిగెత్తింది జయలక్ష్మి. డ్రాయింగు రూమ్‌లో కూర్చుని టి.వి. చూస్తున్న మామగారిని చూసి 'సారీ మామయ్యగారూ, అలస్యం అయిపోయిందివాళ, పది నిమిషాల్లో పెట్టేస్తాను ఫలహారం' అంది అపాలజిటిక్‌గా.

'ఫరవాలేదమ్మా' అన్నాడాయన- తల్లిని చూసి చేతులు చాపుతూ మొహం అంతా నవ్వు చేసుకుని చేతులందిస్తున్న కూతురి తల నిమిరి వంటింట్లోకి దూరి కుక్కరులో నాలుగు యిడ్లీలుపెట్టింది. ఫ్రిజ్‌తీసి పచ్చడి బయటపెట్టి, ఉదయం వంటంతా వేడిచేయసాగింది. తల్లిని చూసి టి.వి. చూస్తున్న ఐదేళ్ళ బాబు పరిగెత్తి వచ్చి తల్లి నడుం వాటేసుకున్నాడు. 'ఆకలేస్తుందా నాన్నా ఒక్కపదినిమిషాలు అగు, తాతగారికి టిఫిన్ పెట్టేసి నీకు అన్నం పెడతాను. హోంవర్క్ చేసేశావా. రేపేదన్నా యూనిట్ టెస్ట్ ఉందా. పుస్తకాలన్నీ బ్యాగ్‌లో సర్దేశావా లేదా" కొడుకుతో మాట్లాడుతూనే ఇడ్లెన్లు తీసి ప్లేట్లలో పెట్టి నెయ్యి, పచ్చడి, మంచినీళ్ల గ్లాసు డైనింగ్‌టేబుల్ మీద పెట్టి 'రండి మామయ్యా ఫలహారం పెట్టాను' అంది దగ్గరికి వెళ్లి వాకర్ కర్రచేతికి అందించి, ఆయన అది పట్టుకుని అతికష్టంమీద లేచి ఒక కాలు యీడుస్తూ డైనింగ్‌టేబుల్ దగ్గరికి వచ్చారు.

'రాహుల్ చారు వేడి చేస్తున్నాను. ఒక్క నిమిషం, బాత్‌రూమ్‌కెళ్ళి బట్టలు మార్చుకు వచ్చి భోజనం పెట్టేస్తాను. ఏం' అంది లాలనగా. ఏడాదికూతురు మళ్లీ తల్లిని చూసి చేతులందించింది. 'వస్తానే తల్లీ, ఒక్క నిమిషం వుండూ బయట బట్టలు మార్చి వస్తాను' అంటూనే తువ్వాలు పట్టుకుని బాత్‌రూమ్‌లో దూరి రెండు చెంబులు దిమ్మరించుకుని నైట్‌గౌన్ తొడుక్కుని వచ్చింది. జుత్తు పైపైన దువ్వకుని, బొట్టుబిళ్ల తగిలించుకుని పనమ్మాయి చేతిలోంచి పాపను అందుకుంది. ఏడాది పాప అబగా తల్లి మెడ కరుచుకుపోయింది. కూతుర్ని ముద్దులు పెట్టుకుంటూ ఎత్తుకుని వంటింట్లోకి వెళ్లింది. వంటి చేత్తోనే పటకారుతో వంట గిన్నెలన్నీ తెచ్చి టేబిల్‌మీద పెట్టి ఎలక్ట్రిక్ కుక్కర్‌లో పనమ్మాయి పడేసిన అన్నం గిన్నె పట్టుకుని వచ్చింది. కంచంలో వేడి అన్నం, పప్పు, నెయ్యి వేసి మెత్తగా కలిపి 'నాన్నా రాహుల్ రా' అంది. కూతుర్నెత్తుకుని కుర్చీలో కూర్చుని కొడుక్కి అన్నం తినిపిస్తూ స్కూలు విశేషాలు, హోంవర్కు వివరాలు అడిగింది.

'మామయ్యా హోంవర్కు చేశాడా వీడు' అంది. ఆయన తలూపి నవ్వాడు మనవడి వంక చూసి 'వీడికింకా చదువు మీద ధ్యాసలేదమ్మా. చదివేది ఒకటోక్లాసు, అయినా బోలెడు పుస్తకాలు, హోంవర్కులు - ఓ అరగంట కూర్చునేసరికి వాడి ధ్యాస మారిపోతుంది' అన్నారు. మనవడి మీద కంప్లయింట్ చేస్తున్నట్టు. 'రాహుల్, తాతగారిని అల్లరి పెట్టకుండా చకచక హోంవర్క్ చేసుకోవాలని చెప్పానా, తరువాత ఆడుకో వచ్చుగా' అంది.

రాహుల్ 'తాతయ్య రోజూ వన్‌టూత్రీలు, చూచి రాత రాయమంటాడు. స్కూలు కాపి రాయాలి. మళ్లీ యింటి దగ్గర చూచి రాయాలా' 'అదికాదు నాన్నా- చూసి అంకెలు, అక్షరాలు అన్నీ బాగా రాయాలి. ఫౌండేషన్ సరిగా వుండాలని తాతగారు పదేపదే రాయమంటారు. పుస్తకంలో పాఠంచూసి రాస్తే లెసన్ చదవక్కరలేకుండా బాగా వచ్చేస్తుంది తెలుసా'. కొడుక్కి లాలనగా చెప్తూ పెరుగు అన్నం కలిపి తినిపించి 'వెళ్లు మూతి కడుక్కుని, కాళ్లుకడుక్కుని నైట్ డ్రెస్ వేసుకుని పడుకో యింక, తొమ్మిదయింది. మళ్లీ లేవవు ప్రొద్దుట.'

ఎంగిలి కంచాలు తీసి సింక్‌లో పడేసి, పాపకి ఫారెక్స్ కలిపి వళ్ళో కూర్చోపెట్టుకుని తినిపించింది. తల్లి వళ్ళో కూర్చుని తృప్తిగా తిని కాసేపు ఆడుకుని వళ్లోనే నిద్రపోయింది,. పాపని పడుకోబెట్టి - ఫ్రిజ్ తీసి రేపటికి కూరలు బయటపెట్టి పనమ్మాయి కిచ్చింది తరగమని., కాసేపు రిలాక్సింగ్‌గా సోఫాలో కూర్చుని టి.వి.చూస్తూ పేపరు తిరగేసింది. బయట కారు చప్పుడు విని పుస్తకాలు, పేపర్లు అవి సరిగా సర్ది పిల్లల బొమ్మలు, సామాన్లు అవి సరిగా సర్దింది.

మామగారు తినగానే వెళ్లి పడుకున్నారు. తొమ్మిదన్నర అవుతూండగా ప్రకాష్ లోపలకి వచ్చి అలసటగా సోఫాలో వాలిపోయాడు. 'పిల్లలు పడుకున్నారా, నాన్న నిద్రపోయారా' రొటీన్‌గా అడిగే ప్రశ్నలు వేస్తూనే బూట్లు విప్పుకున్నాడు. 'త్వరగా ఫ్రెష్ అయిరండి. ఆకలేస్తుంది తిందాం' అంది జయలక్ష్మి ఆలసటగా ఆవలిస్తూ.

'జస్ట్ ఎ మినిట్' - బెడ్‌రూమ్‌లోకి వెళ్ళాడు. పది నిమిషాల్లో అతను బయటకి రాగానే యిద్దరికి కంచాలలో వడ్డించి, పనమ్మాయి ప్లేటులో అన్నీ పెట్టి అందించి 'తినేసి వంటిల్లు సర్ది తుడిచేయి' అంది.

భార్యభర్త రోజంతటిలో భోంచేసే యీ పదినిమిషాలే కాస్త సావకాశంగా కూర్చొని మాట్లాడుకునే సమయం. యిద్దరి ఆఫీసు కబుర్లు, పిల్లల విషయాలు, డబ్బు ఇన్‌వెస్ట్‌మెంట్లు, ఇంటిసామాన్లు, వచ్చిన ఉత్తరాలు - ఏది మాట్లాడాలన్నా యీ టైములోనే. ఓ అరగంట కాస్త సావకాశంగా తినేసరికి నిద్ర ముంచుకు వస్తుంది. పది పదిన్నర మధ్య పక్కమీద వాలీ వాలగానే నిద్ర ముంచుకువస్తుంది.

తెల్లారి ఐదుగంటలకి అలారం గుండెలమీద తన్ని కూర్చోపెట్టినట్టు మెలకువ రాగానే కళ్ళైనా పూర్తిగా విప్పకుండానే బాత్‌రూమ్‌లోకి పరిగెత్తి రెండుసార్లు టూత్ బ్రష్ ఆడించి మొహాన చన్నీళ్లు కొట్టుకున్నాక మెలకువ వస్తుంది. అప్పుడు వంటింట్లోకి ప్రవేశించి అష్టావధానం, శతావధానంలా కాఫీతో మొదలెట్టి, టిఫిన్లు, రెండుపూటలకి వంట, బాక్సుల్లోకి చపాతీలు, మధ్యలో కొడుకుని లేపడం, మామగారికి కాఫీ అందించడ్డ, కొడుకుని తయారుచేసి ఆటో ఎక్కించి, భర్తగారి అవసరాలు చూసి పనిపిల్లతో గదులూడిపిస్తూ, వస్తువులు సర్దుతూ, బట్టలు నానబెట్టి, టిఫిను టేబిల్‌మీద సర్ది, పాపనిలేపి నీళ్లుపోసి, యింకో రెండు చేతులుంటే యింకో రెండు స్టవ్‌లుఅంటించి వంటింకా తొందరగా చేద్దును కదా అనుకుంటుంది. ఎనిమిదికల్లా అన్నీ రెడీ చేసి స్నానించి, ఏం కట్టుకుంటుందో కూడా చూసే తీరిక లేక దొరికిన చీర కట్టుకుని, మొహాన యింత బొట్టు పెట్టకుని, రెండిడ్డెన్లు నోట్లో కుక్కుకుని, చపాతి బాక్స్ తీసుకుని పనిపిల్లకి పాప జాగ్రత్తలు చెపుతూ, పార్క్‌చేసిన కెనటిక్ హోండా ఎక్కి ఆఫీసుకి పరుగు. ఎనిమిదిన్నర నుంచి రాత్రి ఏడున్నర ఎనిమిది వరకు కళ్లు చిల్లులు పడేలా కంప్యూటర్ ముందు కూర్చుని - మధ్యాహ్నం కూరో, పచ్చడో,రొట్టో, అన్నమో కూడా తెలియకుండానే నోట్లో యింత పడేసుకోవడం - మళ్ళీ రాత్రి ఎనిమిదికిల్లు చేరితే ఎదురుచూసే పని, ఒక యంత్రానికి, తనకీ ఏం తేడా లేదనుకుంటుంది జయలక్ష్మి.

కాలేజీలో చదువుతుండగా పెద్ద పెద్ద చదువులు చదివేసి అమెరికా వెళ్లిపోయి ఎమ్మెస్‌లు చేసేసి లక్షల రూపాయలు డాలర్లలో సంపాదించేసేయాలన్న కలలన్నీ నిజమయ్యేయి. ఇంజనీరింగు చేసింది. కంప్యూటర్‌కంపెనీలో ఉద్యోగమూ సంపాదించింది. డాలర్లు సంపాదించుకుంది. అట్టహాసంగా మరో కంప్యూటర్ యింజనీరుతో పెళ్లయింది , కన్న కలలకీ, జీవితానికీ చాలా తేడా ఉంటుందన్నది పెళ్ళయ్యాక అర్థం అయింది. ఇంజనీరయింది. డబ్బు సంపాదించింది. కాని సుఖం అన్న పదం జీవితంలోంచి మాయమయింది.

అమెరికాలో వున్నన్ని రోజులు ఒకరకంగా కాస్త నయం, శని, ఆదివారాలు, యిల్లు తుడుచుకోవడాలు, వంటలు చేసుకోవడం, బట్టలుతుక్కోవడం, అన్నింటికి మిషన్లు, హాట్, కోల్డ్‌వాటర్లు, వారినికి ఒకసారి తుడిచినా దుమ్ముధూళి లేని ఇల్లు, చెమటపట్టని బట్టలు - ఉదయం ఏ ఫ్రూట్‌జ్యూసో, కార్న్‌ఫ్లేక్సో, మధ్యాహ్నం ఓ శాండ్‌విచ్- అంత ఆకలి కూడా వుండదు కనుక ఎక్కువ వండుకోలేకపోయినా ఫరవాలేదు. రాత్రి వచ్చి షాపులో దొరికే తందూరి రొట్టెలు నాలుగు మైక్రో వోవెన్‌లో వేడిచేసుకుని, కాస్త అన్నం కుక్కర్లో పడేస్తే వంట అయిపోయేది. అంత శ్రమ అన్పించేది కాదు. అదీకాక అక్కడ పనివాళ్ళుండరు కనుక సగం యింటిపని ప్రకాష్ చేసేవాడు. పెళ్ళయ్యాక ఉద్యోగాలలో

స్థిరపడ్డాక పిల్లాడిని ప్లాన్‌చేసి కన్నారు. బేబిసిట్టర్‌కి బోలెడు డబ్బులుపోసినా పిల్లవాడిని సరిగానే చూసేది.

ఇండియాలో వున్న అత్తగారు పోవడం, మామగారు వంటరి అయి పాపం అన్నీ చూసుకుంటూ ఒక్కరే వున్నారన్న చింత ఆయనని అమెరికా రమ్మంటే నేనక్కడ యిమడలేనురా నాపాట్లు నేపడతానన్నారు. ఏదో ఆయన బతుకు ఆయన బతుకుతున్నారనుకునే వేళకి ఆయనకి పెరాల్సిస్ స్ట్రోక్ వచ్చింది. ఒకకాలు, చెయ్యికి వచ్చింది. మూతికాస్త వంకర అయినా నెమ్మదిగా సర్దుకుంది. మాట కాస్త స్పష్టత లోపించింది. ఎడంకాలు యీడ్చుకుంటూ, ఎడంచెయ్యి కాస్త అవిటి వడంతో ఆయనకి మనిషి సాయంకావల్సి వచ్చింది. తండ్రిని అలా వంటరిగా వదిలేయలేక ప్రకాష్ ఇండియా వెళ్లిపోదాం అన్నాడు. అప్పటికి నాలుగైదేళ్ళు గడిచి అమెరికా మోజు తగ్గి తనూ సరేనంది. లక్కీగా ప్రకాష్‌కి సత్యం కంప్యూటర్స్‌లో, తనకి విప్రోలో ఉద్యోగాలు వచ్చాయి, మంచి జీతాలు ఆఫర్ రాగానే అమెరికా నుంచి వచ్చేశారు. అమెరికాలో సంపాదించుకు వచ్చిన లక్షలుపోసి మంచి యిల్లు కొన్నారు. వూరినుంచి మామగారిని పిలిపించుకున్నారు. ఆయనకి పాపం వేళకింత పెడితే ఆయన పనులు ఆయన చూసుకోగలిగే శక్తి ఉంది.

ఇండియా వచ్చాక అక్కడికి యిక్కడికి పనులకెంత తేడా వుందో అర్థం అయింది. ఇక్కడ మూడుపూటలా వండుకోవాలి. తినాలి. బట్టలు రోజూ ఉతకాల్సిందే. యిల్లు రెండుపూటలా చిమ్మాల్సిందే. వంటలెక్కువయి గిన్నెలు ఎక్కువ - యిండియాలో ఆకలీ ఎక్కువే. ఉదయం టిఫిను తప్పనిసరి. భోజనంలోకి అన్ని అధరవులూ వుండాలి.

ఫ్రిజ్‌లో అమెరికాలోలాగ ఎన్నాళ్ళయినా పాడవకుండా వుండవు. కరెంటు పోవడాలు, వాతావరణంలో వేడి, ఫ్రీజర్‌లో పెడితే తప్ప పదార్థాలు నిలవుండవు. యింట్లో ముసలాయన వుండడంతో అన్నీ యధావిధిగా చెయ్యాలి. అక్కడ ఎంతసేపు పనిచేసినా రాని అలసట యిక్కడొస్తుంది. ఆఫీసులోనూ- అక్కడికంటే యిక్కడ పని టైమింగ్స్ ఎక్కువే. పాపని కని మూడో నెలలో రావడంతో చంటి పిల్లని చూసుకోవడం, రాత్రిళ్లు సరిగా నిద్రలేకయింట్లో పని ఎక్కువై డీలా పడిపోయింది. వంటకి మనిషి - యిద్దరు మారారు. వండి పెట్టిపోతాం అని ఒకరు,. వాళ్ళకి అక్కడ అన్నీ అమర్చితే వంటచేసి పోవడానికి వాళ్ళెందుకు, రోజంతా యింట్లో వుండాలి అని తాననుకుంది.

ఒకావిడ యింట్లో మూడు నెలలు చేసిపప్పులు, ఉప్పులు, స్టీలు సామాన్లు అన్నీ కూతురింటికి చేరేసింది. ఒకసారి దొరికిపోయాక మానిపించింది. యింట్లో పిల్లని చూసుకోవడానికి ఎలాగో ఆయా కావాలి. వంటెంత సేపు అనుకుంది. కాస్త శుభ్రంగా వున్న పదమూడేళ్ళ పిల్ల దొరికింది.

యింట్లో పెద్దదిక్కుగా మామగారుండడంతో కాస్త నిశ్చింత, పనిపిల్ల పాపని సరిగా చూడకపోయినా, కాస్త కేకలేసేందుకు, రాహుల్ ఇంటికొచ్చి తిన్నాడో లేదో చూసేందుకు కాస్త ధ్గరగ కూర్చో పెట్టుకుని హోంవర్కు చేయించి చదివించు కోడానికి, అన్నింటికన్నా యింటి కాపలాగా ఆయనుండడంతో ఏ వేళకి వచ్చానా పిల్లలు వంటరిగా వున్నారన్న భయం లేకుండా అయనుండం నిశ్చింత. అన్నీ వండి పెడితే మధ్యాహ్నం కుక్కర్లో అన్నం పడేయడం. ఆయనకి మధ్యాహ్నం కాఫీ కలిపి ఇవ్వడం పనులన్నీ పనిపిల్లకి నేర్పింది. గత ఏడాదినుంచి యీ రొటీన్ అలవాటయి బండి గాడిలో నడుస్తూంది. 'ఏమిటి డల్‌గా వున్నావు. అలసిపోయావా" ప్రకాష్ వాడిన జయలక్ష్మి మొహం చూసి అన్నాడు. జయలక్ష్మి తలూపింది. "ఏమిటో ఇక్కడ తొందరగా అలిసిపోతున్నాము. అసలు యించికొచ్చేసరికి ఓపిక లేనట్లుంటోంది. "బి- కాంప్లెక్స్ వేసుకుంటున్నావా లేదా. కాస్త పాలు, అవీ తాగమంటే వినవు, ఎప్పుడూ హడావిడే నీకు తిండి దగ్గరకు వచ్చేసరికి".

'సావకాశంగా హాయిగా కూర్చుని తినే అదృష్టం కూడానా - ఏదో బతకడానికి తిన్నట్టు మింగడం - వున్న యిరవై నాలుగ్గంటలు కాక యింకో పది గంటలుంటే బాగుండును రోజులో ...' నిర్వేదంగా అంది. అతను కుర్చీ జరిపి లేచాడు. 'పడుకో వెళ్లి, మళ్లీ ఐదు గంటలకి లేస్తావు - ఇంకో గంట పడుకోవచ్చు - కాస్త ఆ పనిపిల్ల చేత యింకాస్త పనులు చేయించుకో. లేదంటే ఇంకో పనిమనిషిని పెట్టుకోరాదూ -

'పెట్టుకో అంటారు. దొరికితే నాకేం సరదానా కష్టపడడానికి. ఎవరినడిగినా ఆరు గంటలకి ఎవరొస్తారు అంటున్నారు. నేవెళ్ళాక వస్తే ఏం లాభం - ఇద్దరు ముగ్గురిని చూసాగా. ఎవరన్నా పట్టుమని పదిరోజులు నిలబడి చేశారా? ఈ ఏడాదిలో ఐదుగురు పనివాళ్ళు మారారు. ఏదో అదృష్టం కొద్దీ యీ పిల్లేనా దొరికింది. లేకపోతే నా పని అయ్యేది - అటు ఆఫీసులో పనీ ఎక్కువయింది. ఏమిటో యీ ఉద్యోగాలు ఒక్కోసారి మానేద్దాం అనిపిస్తూంది. ఉద్యోగం చేసి సాధించింది. అనుభవిస్తున్నది ఏముందో ఆలోచిస్తే అర్థం కావడంలేదు' విసుగ్గా అంటూ లేచి చేయి కడుక్కుంది.

ఇది వాళ్ళిద్దరి మధ్య మొదటిసారి సంభాషణ కాదు. మరీ చెయ్యలేక నీరసం అనిపించినపుడు, శారీరకంగా, మానసికంగా అలసిపోయి ఏదో నిర్వేదం చుట్టుముడుతుంది. యిద్దరి జీతాలు కలిపి ఎనభైవేలు సంపాదిస్తున్నారు. ముప్పై ఐదు లక్షలు పెట్టి బంగ్లా కట్టారు. యింటికి సరిపడా ఫర్నిచర్ కొన్నారు.

ఒక్కరోజు ఆ సోఫాల్లో సావకాశంగా యిద్దరూ డ్రాయింగ్‌రూంలో కూర్చున్నారా? యిన్నివేలు సంపాదిస్తున్నారు. ఒక్కసారైనా ఓ సినిమాకో, షికారుకో, రామోజీ ఫిల్మ్‌సిటీ చూడాలన్న చిన్నకోరిక కూడా తీరలేదు. పిల్లలతో కలసి ఆదివారమైనా ఎటైనా వెళ్ళాలని వున్నాఓపికుండదు. వారానికి సరిపడా కూరలు,సామాన్లు చూసుకోవడం, పిల్లలకి, తనకి

తలంట్లు, బెడ్‌రూం అలమరలు, వంటిల్లు కాస్త సర్దుకోవడం, పిల్లాడు ఏం చదువుతున్నాడో, పిల్లకి ఏం బట్టలు పొట్టి అయ్యాయో, ప్రకాష్ పాతబట్టలు తీసి పడేయడం, వారానికి సరిపడా యిడ్లీ పప్పు రుబ్బడం, పిల్లలకోసం సాయంత్రం ఏస్వీటోచెయ్యడం, యివన్నీ అయ్యేసరికి మధ్యాహ్నం నిద్ర ముంచుకు వస్తుంది. లేచేసరికి బద్ధకం, పాపతో ఆడుతూ కూర్చుంటుంది ఒక్కరోజేగా దాన్ని ముద్దు చేసేది అనిపిస్తుంది. యిలాగే రోజులు వెళ్ళిపోతున్నాయి.

డబ్బున్నందుకు మంచి మంచి చీరలైనా కొనుక్కోవాలన్న కోరికలేనంత రొటీన్ అయిపోయింది జీవితం. అసలు అన్నిరకాలు కలుపుకుని సావకాశంగా అన్నం తింటుందా - ఎందుకీ సంపాదన, ఎందుకీ వేల జీతాలు - అమ్మానాన్నలని చూసి రావడానికైనా సెలవు ఓ పట్టాన దొరకదు - వాళ్ళే పాపం అప్పుడప్పుడు వచ్చిపోతారు. బాగా విసుగొచ్చి విసుక్కున్నరోజు 'నీ కంత యిష్టం లేకపోతే మానేయి ఉద్యోగం నేనేం నిన్ను చెయ్యమని బలవంత పెట్టానా' అంటాడు. ఆ విసుగు తనమీద తిరిగిన రోజు మీ ఆడవాళ్ళు అసలింతింత చదువులు చదవడం దండగ - చదివి ఉద్యోగం చెయ్యకుండా యింట్లో కూర్చోడం క్రిమినల్. మీ సీటు ఓ మగాడికి యిస్తే నలుగురిని పోషిస్తాడు. చెయ్యలేరు. మళ్లీపెద్దకబుర్లు. స్త్రీ సమానత్వాలు చూపాలని ఆరాటం. చదువుకుని మీకో అస్థిత్వం వుండాలని. వుందని చూపాలని తాపత్రయం . మళ్ళీ అంతంత జీతాలు వదులుకోలేరు. మీకేం కావాలో మీకే తెలియదు' అంటూ వెక్కిరిస్తాడు.

నిజమే, నాలుగేళ్ళ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెండేళ్ళు చేసి యింట్లో కూర్చోడానికా. వేలు ఖర్చుపెట్టి, యింకా లక్షలు ఖర్చుపెట్టి అమెరికా వెళ్ళి ఏం సాధించినట్టు - అంత చదివి ఉద్యోగం లేకుండా కూర్చోడం అంటే అన్యాయమే మరి. అలా అని సంపాదించుతూ సాధించింది ఏముందో అర్థం కావడంలేదు. తన జీతం ఎంత చేతికి వస్తుందో పి.ఎఫ్ కట్స్ అని కూడా చూసుకోకుండా పేస్లిప్, డబ్బు తీసుకొచ్చి ప్రకాష్‌కిచ్చేస్తుంది. అతనే ఖర్చులు, ఇన్‌వెస్ట్‌మెంట్లు చూసుకుంటాడు. యింటి ఖర్చుకి వేరే యిచ్చింది ఖర్చుచేస్తుంది తాను.

ఇల్లు ఎంతో కళాత్మకంగా దిద్దుకోవాలని, మంచి గార్డెనుండాలని, గార్డెనులో సాయంత్రం కల్సి కబుర్లు చెపుతూ టీ తాగడం అవన్నీ సినిమాల్లో చూసి సంతోషించా లే తప్ప నిజ జీవితంలో జరిగేవి కావు అనిపిస్తుంది. అంత సావకాశం ఎక్కడుంది. చచ్చీ చెడి ఇంటికొచ్చేసరికి తోటకూర కాడలా వాడిపోతుంటే యింక దేనిమీద వుంటుంది. అభిరుచులు ఏం లేవు. అన్నీ పగటికలలే. మిషనుకి తనకి ఏం తేడాలేదు. ఉద్యోగం లేకపోతే హాయిగా ప్రకాష్ యింటికిచ్చేసరికి ఫ్రెష్‌గా తయారై తోటలో ఎదురుచూస్తూ కూర్చుందామన్నా అతను రాత్రి తొమ్మిది లోపల రానేరాడు. కారులో షికార్లు, అవన్నీ

ఎప్పటిమాటలో! యిప్పుడు ప్రతివాళ్ళకి డబ్బు సంపాదన యావ ఒక్కటే అభిరుచిగా మిగిలింది.

ఇచ్చిన జీతానికి పన్నెండు గంటలు మనిషిని పిండుకుంటాయి కంపెనీలు, కంపెనీల మధ్య పోటీలు పెరిగి అందుకోవాల్సిన టార్గెట్ అందుకోలేకపోతే, నిర్ణీత కాలంలో అనుకున్న ప్రాజెక్టులు పూర్తి చెయ్యలేకపోతే ఉద్యోగలూడతాయి అన్న భయాలతో ఉద్యోగస్తులు - జీవితంలో రక్తి, అనురక్తి దూరం అయ్యాయి. మగ, ఆడ మధ్య శృంగార భావాలకీ టైమూలేదు. ఓపికలేదు - ఏదో ఒకరో ఇద్దరో పిల్లల్ని కని ముప్పై నలభై ఏళ్ళకే జీవితం యాంత్రికంగా సాగించే ధోరణి జనానికి - యీ పరుగులు, సంపాదన యివన్నీ ఎవరి కోసం!

ఆ కన్న ఒకరిద్దరినీ పెద్ద చదువులు చదివించేసి, ఎమ్‌సెట్లు రాయించేసి ఇంజనీర్లు చేసి అమెరికాకి తరిమేసి ఆ తరువాత తీరికగా పిల్లలు దూరం అయ్యారని బాధపడ్తూ, వెళ్ళినవాళ్లు రారని, అయినా యీ పాడు దేశంలో పిల్లలకేం భవిష్యత్తుంది అని తమకితాము సర్ది చెప్పుకుంటూ పురుళ్లకి, పుణ్యాలకి అమెరికా వెళ్లివస్తూ వచ్చిందగ్గరనుంచి అక్కడుండలేక తిరుగు ప్రయాణాలు కట్టడం, ఏ రెండేళ్ళకో పిల్లలొస్తే పండుగ చేసుకోడం, పిల్లలు అమెరికాలో వున్నారని గర్వపడడం, ముసలివాళ్ళు అవుతున్న కొద్దీ చూసేవాళ్ళు, చేసేవాళ్ళు లేరని బాధపడ్తూ తలకొరివి పెట్టడానికన్నా టైముకి కొడుకు వస్తాడో రాడోనని బెంగపడ్తూ, యీ కూడబెట్టిన ఆస్తులు అమ్ముకోడానికైనా వాళ్లకి టైముంటుందో లేదోనని బెంగపడ్తూ, యిదీ జీవితం! యిదీ డబ్బుకి దాసోహం అయి రాత్రింబగళ్ళు భార్యాభర్తలు కష్టపడ్తూ చేస్తున్న నిర్వాకం...'

నిద్రపట్టే వరకు ఏవో ఆలోచనలు - ఈ చదువులు, ఉద్యోగాలు, అమెరికాలు సుఖాలు ఎలా ంటి వంటే పద్మవ్యూహంలోకి జొరపడేవరకు లోపలెలా వుంటుందో చూడాలన్న ఆరాటం, కుతూహలం, ఏదో సాధించాలన్న ఆరాటంతో జొరపడి ఆ తర్వాత బయటకొచ్చే మార్గం తెలీక అలా అలా అక్కడే తిరగడంలా అయిపోతూంది. లోపలికెళ్ళడం తెల్సుగాని బయటకి రావడం అర్థంకాని స్థితిలో వున్నారు తామంతా. ఎప్పటికో నిద్రపట్టింది జయలక్ష్మికి.

◆ 'పత్రిక' ప్రత్యేక సంచిక, అక్టోబరు-2001